# స్వీట్ నథింగ్స్ జ్ఞాపకాలకే పరిమితమా!...



—శాకా శ్రీనివాసరావు

'బిజినెస్ పనిమీదనే.. అద్సరే.. మీ వివరాలు చెప్పారు కాదు.. మీరు తమిళియన్లా?'

అంటూ ఆమె అంతవరకూ నాపై సంధిస్తూ వచ్చిన ప్రశ్నల శర పరంపరను తిరిగి ఆమె వైపుకు నేను గురిపెట్టి వదలసాగాను. ఆ ప్రశ్నవంటి జవాబు ద్వారా!

కాదు.. మలయాళీలం... మాది త్రివేండ్రం.. ఆ ఎదురుగా నున్న గడ్డపు వ్యక్తి మా అన్నయ్య బీహార్‌లో జాబ్ చేస్తున్నాడు. నేనూ అక్కడే చదువుకుంటున్నాను. నా పేరు అంబేగా ఎలా ఉంది?'' గబ గబా అప్పజెప్పి అడిగిందామె.

''సో ఫైన్'' అన్నాను. అందుకామె "రియల్లీ?'' అంది ఆశ్చర్యాన్నీ ఆనందాన్నీ కలిపి ప్రకటిస్తూ చిర్నవ్వుతో.

'మీ అడ్రస్ ఇవ్వండి' సందేహిస్తూ అడిగాను.

''మీరు వస్తారా అంత దూరం?'' అంటూ ఆశ్చర్యాన్ని విచ్చుకున్న కమలాల్లా నయనాలను విప్పుతూ మరోసారి ప్రకటించిందామె.

తప్పకుండా అన్న నా సమాధానం స్థిరంగా వెలువడింది.

అందుకేనేమో ఆమె సిగ్గు పడుతున్నట్టూ తల దించుకుని "అడ్రస్ వ్రాసి మీరు దిగేలోపు అందజేస్తా. వచ్చే ముందు లెటర్ వ్రాయండి" అని చెప్పి తన పాత స్థానానికి వెళ్లిపోయింది.

ఆమె తన అన్నయ్య అంటూ పరిచయం చేసిన వ్యక్తి ఆమెనేదో సీరియస్‌గా ప్రశ్నించసాగాడు. ఆమె నా వైపు చూపుతూ ఏవో సమాధానాలు చెప్పసాగింది. ఇంతలో ఒరిస్సా స్టేట్‌లో ప్రఖ్యాతి గాంచిన చిల్కా సరస్సు దగ్గర పడడంతో దాని గురించి వివరిస్తోన్న మావయ్య మాటల్లో మునిగిపోయాన్నేను.

సువిశాలంగా విస్తరించుకున్న ఆ సరస్సులో స్వేచ్ఛగా విహరిస్తోన్న విహంగాలను గమనించిన నాలో అంబేగా, నేనూ ప్రేమ రెక్కలు తొడుక్కుని వాటివలె ఎగురుతూ సంచరించగలిగితే ఎంత అద్భుతంగా ఉంటుందో ఆ అనుభవం అన్న చిలిపి ఊహ ఉదయించింది. నా భావన ను ఆమె గ్రహించినట్టు కళ్లతోనే చిలిపిగా నవ్వసాగింది. అలాంటి భావనలతో కాలం కడతేరిపోగా ఒంటిగంటకు వైజాగ్‌లో ఆగింది మెయిల్.

అది లంచ్ టైమ్ కావడంతో వాటర్ బాటిల్స్‌తో అందరూ హడావిడిగా ప్లాట్‌ఫారమ్ మీదకు దిగసాగారు. ఆమె అన్నతోపాటు మావయ్య కూడా దిగడంతో కాబిన్‌లో మేమిద్దరం మిగిలాం. నేను మీల్స్ బుక్ చేసుకోకపోవడంతో సర్వర్ ఆమెకు తెచ్చిన ప్లేట్‌లోని భోజనం కలిపి నేనువారిస్తున్నా వినక సగభాగం నాచేత బలవంతాన తినిపించింది.

ఆమె అభిమానానికి విపరీతంగా కదిలిపోయిన నేను ''అతి తక్కువకాలంలో అయిన పరిచయానికే ఆ అపరిచిత వ్యక్తి అంతటి ఆప్యాయతను అందిస్తుంటే ఆమెను జీవిత భాగస్వామిగా చేసుకోలిగిన వాడు ...'' అని ఆలోచిస్తుండగా వాటిని తన రాక ద్వారా ఖండిస్తూ చేసుకున్నప్పుడు మాటకదా'' అని ప్రశ్నిస్తున్నట్టూ ఆమె అన్న నీళ్ల బాటిల్‌తో ప్రత్యక్షమయ్యాడు. అదే సమయంలో మరో వైపు నుంచి మావయ్య కూడా కొన్ని రకాల ఫ్రూట్స్ చేతినిండా పుచ్చుకుని లోనికి వచ్చాడు. దాంతో మా ఏకాంతం అంతమైపోయింది!

గమ్యం దగ్గరౌతున్న కొలదీ ట్రయిన్ వేగం పెరుగుతున్నట్టూ.. కాలం గిర్రున తిరిగిపోతున్నట్టూ మొట్టమొదటిసారిగా అనిపించసాగింది నాకు!

ఆమె ఓ కార్డ్‌పై తన అడ్రస్ వ్రాసి నాకు అందించడానికి చేసిన ప్రయత్నాల్లో ఆమె అన్నవలన విఫలంగా కావడంతోపాటూ నే దిగవలిన స్టేజ్ దగ్గర పడుతుండటంతో ఆమె అన్నపై నాలో జనించిన ఉక్రోషాన్ని అతనికి నా వాడి చూపులతోనే తెలుపసాగాను. అంతకు మించి ఏం చేయలేని స్థితిలో అతగాడేమీ పట్టించుకున్నట్టు కనిపించలేదు!

ఇక అప్పటినుంచీ మా మధ్య మౌనమే రాయబారిగా చూపులతో అందిస్తున్న సందేశాలకూ సంకేతాలకూ వ్యవహరించసాగింది.

సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో సామర్లకోటలో తన వంతు బాధ్యతగా ఆగింది మెయిల్.

ముందుగా దిగిన మావయ్య సూట్‌కేస్‌తో సహా ప్లాట్‌ఫారంపై అప్పుడే కొన్ని గజాల దూరం వెళ్లిపోయాడు. కానీ అతి విచిత్ర పరిస్థితుల్లో నేను అడ్రస్‌కై కొట్టుమిట్టాడుతూ ట్రయిన్ దిగబోతుండగా కిటికీ దగ్గరకు నిగి రమ్మని ఆమె సైగ చేయడంతో ఒక్కసారిగా ఉప్పెనలా ఎగసి వెళ్లాను. కానీ అక్కడ ఆమె అన్న కూర్చున్నాడు బయటకు చూస్తూ.

ఇంతలో వెనుకనుంచి మావయ్య పిలుపు!

అది గమనించిన అతడు మావయ్య వైపు చూపుతూ హిందీలో ఏదో అంటున్నాడు. కానీ అవేమీ వినే స్థితిలో నేను లేను.

పిచ్చివాడిలా నిల్చున్న నన్ను వెక్కిరిస్తూ మెల్లగా ముందుకుసాగిపోయింది మెయిల్!

ఒక్క రోజులో ప్రణయంగా మారిన స్నేహం ఒక్క నిముషంలోనే జ్ఞాపకంగా మిగిలి పోవడానికన్నట్టూ శాశ్వతంగా దూరమౌతుంటే మనసులో సుళ్లు తిరగడం మొదలు పెట్టిన వ్యక్తంకాని ఆవేదన హృదయాన్ని బరువెక్కించడంతో భారంగా మావయ్యవైపు అడుగులేశాను తలదించుకుని.

ఎడారిలా ఉన్న నా మదిలో చిరుజల్లులా చిలికిన ఆమె ఆప్యాయత ఒయాసిస్సును సృష్టించగలదన్న నా భావన ను భంగపరుస్తూ చిలికిన మరుక్షణంలోనే ఇంకిపోవడంతో

ట్రయిన్ కదిలివెళ్లిపోయాక ట్రాక్‌పై ఏర్పడిన నిశ్శబ్దంలా నా మెదడు శూ(న్యా)న్యతతో నిండిపోయింది!

అది గమనించినట్టూ ''వీటినే స్వీట్ నథింగ్స్ అంటారు. అవి డైరీలో భద్రపరచుకోదగిన పేజీలే కానీ జీవితాన్నే కోల్పోయినట్లుగా విచారించవలసిన విషయాలు కావు...'' అన్నాడు మావయ్య ఓదార్పుగా.

కానీ అవి ఓదార్పులా కాక ''ఆద్యంతమూ నిన్ను గమనిస్తూనే ఉన్నాను సుమా'' అన్న హెచ్చరికలా వినిపించాయి నాకు! ●